


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
ఆదివారం | 14 జనవరి 2024
www.suryaa.com పేజీలు: 02
4PM

బంగారం ధర ₹63,270 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 78,000
సెన్సెక్స్ 72,568 847
నిఫ్టి 21,895 247
చికెన్ ధర 1KG ₹160
గుడ్ల ధరలు డజన్ ₹68




# నా సామిరంగ రివ్యూ






ఈ సంక్రాంతి కానుకగా మన టాలీవుడ్ సినిమా నుంచి రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో అక్కినేని నాగార్జున నటించిన మరో విలేజ్ డ్రామా "నా సామిరంగ" కూడా ఒకటి. మరి నేడే విడుదల అయ్యిన ఈ చిత్రం ఎంతమేర అలరించిందో సమీక్షలో తెలుసుకుందాం రండి.

కథ : ఇక కథలోకి వస్తే..1960వ దశకంలో తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట ప్రాంతంలో పేరు మోసిన వ్యక్తి అందరూ పెద్దయ్యగా పిలుచుకునే నాజర్ ని ఓ ప్రమాదం నుంచి ఇద్దరు అనాథ పిల్లలు అయినటువంటి కిష్టయ్య(నాగార్జున), అంజి(అల్లరి నరేష్) లు కాపాడుతారు. అక్కడ నుంచి కిష్టయ్యని కూడా తన కొడుకుల్లో ఓ కొడుకుగా పెద్దయ్య పెంచుకుంటాడు. మరి అలా పెంచుకున్న పెద్దయ్య కోసం కిష్టయ్య ఎంతవరకు వెళ్లగలడు? పెద్దయ్య కొడుకుల్లో ఒకడైన దాసు(షబీర్ కల్లరక్కల్) కి కిష్టయ్య కి మధ్య వైరం ఎలా ఏర్పడుతుంది? ఈ క్రమంలో వరాలు(ఆశికా రంగనాథ్) పాత్ర ఏంటి అసలు అంజికి ఏం జరుగుతుంది అనేది తెలియాలి అంటే ఈ చిత్రాన్ని చూసి తెలుసుకోవాలి.

ప్లస్ పాయింట్స్ : ఈ చిత్రంలో మంచి క్యాస్టింగ్ కనపడుతుంది. ఒకో పాత్రకి తగ్గట్టుగా పర్ఫెక్ట్ గా ఒకొకరు తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు. మరి మొదటిగా కింగ్ నాగార్జున నుంచే మొదలు పెడితే నాగ్ తన రోల్ లో ఇమిడిపోయారు. సోగ్గాడే చిన్ని నాయన తర్వాత మళ్ళీ ఆ తరహా మాస్ రోల్ లో తన యాస నడవడిక మెయిన్ గా తన స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగున్నాయి. ఇక తనపై యాక్షన్ పార్ట్ కూడా సాలీడ్ గా కనిపిస్తుంది. అలాగే తనకి జోడీగా నటించిన ఆశికా రంగనాథ్ తన పాత్రలో డీసెంట్ గా కనిపిస్తుంది గార్జియస్ లుక్స్ సహా నటన పరంగా ఆమె ఆకట్టుకుంటుంది. వీరితో పాటుగా అల్లరి నరేష్ కి మరోసారి మంచి పాత్ర ఈ సినిమాలో దక్కింది అని చెప్పాలి. తన మార్క్ కామెడీ అనే కాకుండా పలు కీలక ఎమోషనల్ సీన్స్ లో కూడా తాను ఇంప్రెస్ చేసాడు. అలాగే రాజ్ తరుణ్, మిర్నా, రుక్షర్ దిల్లాన్ తదితరులు కూడా తమ పాత్రల పరిధి మేరకు ఆకట్టుకున్నారు. మరో నటుడు విలన్ గా కనిపించిన షబీర్ మాత్రం తన రోల్ ని చాలా బాగా చేసాడని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాలో సెకండాఫ్ లో ఓ కీలకమైన ఎమోషనల్ సీన్ అయితే కదిలిస్తుంది. అలాగే దాని అనుగుణంగా వచ్చే క్లైమాక్స్ పోర్షన్ కూడా మంచి మాస్ ఎలిమెంట్స్ తో ఆకట్టుకుంటుంది అని చెప్పాలి.


మైనస్ పాయింట్స్ : ఈ సినిమా కాస్త డిజప్పాయింట్ చేసే అంశాలు ఎక్కువే ఉంటాయని చెప్పాలి. ఈ సినిమాని కూడా చాలా మంది నాగ్ నుంచి ఓ ప్రాపర్ పండుగ ఎంటర్టైనర్ గా భావించి ఉండొచ్చు. కానీ ఇది మాత్రం అందుకు భిన్నమైన ఎక్స్ పీరియన్స్ ని అందిస్తుంది. సినిమా ఫస్టాఫ్ నుంచి కూడా అంత ఎంగేజింగ్ నరేషన్ ఎక్కడా కనిపించదు. ఎక్కడో కొన్ని కొన్ని కామెడీ సీన్స్ మినహా మిగతా అంతా చాలా చప్పగానే అనిపిస్తుంది. అలాగే నాగార్జున ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ ని ఇంకాస్త బెటర్ గా ప్రెజెంట్ చేసి ఉంటే బాగుండేది. ఇక సెకండాఫ్ కూడా అంత ఆసక్తి గా ఏమి స్టార్ట్ అవ్వదు మాస్ ఎలిమెంట్స్ లోకి వెళ్లడానికి కూడా కాస్త సమయం పడుతుంది. దీనితో సినిమా ఇక్కడ నుంచి బాగుంది అని అనుకోడానికి మాత్రం ఆడియెన్స్ కి చాలా సమయం పడుతుంది. అలాగే చాలా సీన్స్ మనకి రెగ్యులర్ గా ఇది వరకే కొన్ని సినిమాల్లో చూసేసినట్టే అనిపిస్తుంది. ఇక వీటితో పాటుగా సినిమాలో కొన్ని సాంగ్స్ కానీ ఫస్టాఫ్ లో సీన్స్ కి బ్యాక్గ్రౌండ్ స్కోర్ అంత ఎఫెక్టీవ్ గా అనిపించవు. అలాగే కొన్ని చోట్ల గ్రాఫిక్ విజువల్స్ తెలిపోయాయి.

సాంకేతిక వర్గం : ఈ సినిమాలో నిర్మాణ విలువలు మాత్రం బాగున్నాయి. వింటేజ్ బ్యాక్ డ్రాప్ కి కావాల్సిన టోటల్ సెటప్ ని మైంటైన్ చేయడం బాగుంది. టెక్నీకల్ టీం లో ఆర్ట్ వర్క్ ని మెచ్చుకోవాలి. ఇక కీరవాణి సంగీతం పర్వాలేదు. క్లైమాక్స్ లో స్కోర్ మాత్రం చాలా బాగుంది. దాశరధి సినిమాటోగ్రఫి వింటేజ్ ఫీల్ ని తీసుకొస్తుంది. ఎడిటింగ్ లో కొన్ని అనవసర సన్నివేశాలు తగ్గించాల్సింది. ఇక దర్శకుడు విజయ్ బిన్నీ విషయానికి వస్తే.. తాను ఈ సినిమాకి ఓకే అనిపించే వర్క్ చేసాడని చెప్పాలి. మెయిన్ లీడ్ అందరి నుంచి మంచి పెర్ఫార్మన్స్ లను తాను రాబట్టుకున్నాడు. కానీ కథనంని మాత్రం అంత ఆసక్తిగా మలచడంలో విఫలం అయ్యాడని చెప్పక తప్పదు. సినిమాని ఇంట్రెస్టింగ్ గా మార్చడానికి చాలా సమయం తీసుకున్నాడు తాను. వీటితో మాత్రం తన వర్క్ యావరేజ్ గానే అనిపిస్తుంది.

తీర్పు : ఇక మొత్తంగా చూసుకున్నట్టు అయితే పండుగ కానుకగా వచ్చిన "నా సామిరంగ" నాగ్ ఫ్యాన్స్ వరకు మంచి ట్రీట్ ఇస్తుంది అని చెప్పవచ్చు. అలాగే అల్లరి నరేష్ ఈ చిత్రానికి మరో పిల్లర్ గా నిలవగా అక్కడక్కడా ఆకట్టుకునే కామెడీ సెకండాఫ్ లో పలు ఎమోషన్స్ మరియు క్లైమాక్స్ పోర్షన్ లు అలరిస్తాయి. కానీ రొటీన్ కథా, కథనాలు మాత్రం అంతగా మెప్పించవు. వీటితో అయితే ఈ పండుగకు ఫ్యామిలీస్ వరకు ఈ చిత్రం ఒక్క సారికి డీసెంట్ ట్రీట్ ఇస్తుంది.

## 15 రాష్ట్రాలు, వంద లోక్‌సభ స్థానాలు..
## నేడు రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభం

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ మరో యాత్రకు సిద్ధమయ్యారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు భారత్ జోడో పేరుతో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఆయన యాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత్ జోడో న్యాయ యాత్ర పేరుతో మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు పాదయాత్ర చేయనున్నారు. ఆదివారం మణిపూర్‌లోని థౌబల్ జిల్లాలో యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఇటీవల ఆ రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లలో 180 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో యాత్రను అక్కడి నుంచే దీనిని ప్రారంభించనుండటం గమనార్హం. ఈ యాత్ర మార్చి 20న ముంబైలో ముగుస్తుంది. 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాలు, 100 లోక్ సభ స్థానాలు, 377 అసెంబ్లీ స్థానాల మీదుగా ఈ యాత్ర సాగుతుంది. మొత్తంగా 67 రోజుల్లో 6700 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 11 రోజులపాటు 20 జిల్లాల్లో 1074 కిలోమీటర్ల మేర ఈయాత్ర సాగనుంది. జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల్లో ఎనిమిది రోజుల చొప్పున, మధ్య ప్రదేశ్‌లో 7 రోజులపాటు నడువనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న రాహుల్ గాంధీ మరికాసేపట్లో ప్రత్యేక విమానంలో మణిపూర్ బయల్దేరుతారు. ప్రారంభ కార్యక్రమంలో ఏఐసీసీ నేతలు, వర్కింగ్ కమిటీ సభ్యులు, పలు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీపీసీసీ చీఫ్ రుద్రరాజు, రఘువీరారెడ్డి, పల్లం రాజు పాల్గొంటారు.




## బోల్డ్‌గా వామికా గబ్బి



ఈ రోజుల్లో, వామికా గబ్బి తన నటనతో ప్రేక్షకులను చాలా మ్యాజిక్ చేస్తోంది. పంజాబీ చిత్ర పరిశ్రమలో తెరపై ఒక పాత్రను అందంగా చూపించిన వామిక కొంత కాలంగా హిందీ ప్రేక్షకులలో చర్చనీయాంశంగా మారింది. తన కొత్త ప్రాజెక్ట్‌లతో పాటు, వామిక తన స్టైలిష్ మరియు గ్లామరస్ స్టైల్‌ను ప్రజలపై మ్యాజిక్ చేయడం ప్రారంభించింది. అటువంటి పరిస్థితిలో, నటి దాదాపు ప్రతిరోజూ అభిమానులతో కొత్త రూపాలను పంచుకోవడం ద్వారా హృదయ స్పందనలను పెంచుతుంది.ఇప్పుడు మళ్లీ వామిక తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో తన కొత్త లుక్‌ను చూపించింది.

## మాది చిన్న దేశమే..
## బెదిరించడం తగదు
### మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మయిజ్జూ



భారత్-మాల్దీవుల వివాదం నేపథ్యంలో మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మయిజ్జూ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన అనంతరం ఆయన మాట్లాడారు. మమ్మల్ని వేధించే హక్కు ఏ దేశానికి లేదని అన్నారు. 'మేము చిన్న వారమే కావచ్చు, కానీ అది మమ్మల్ని బెదిరించే లైసెన్సు మీకు ఇవ్వదు' అని పరోక్షంగా ఇండియాను ఉద్దేశించి మాట్లాడినట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీపై అక్కడి మంత్రులు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్‌కు బిగ్ షాక్..
## పార్టీకి కేంద్ర మాజీ మంత్రి గుడ్‌బై




రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ప్రారంభం రోజు కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర మాజీ మంత్రి, మహారాష్ట్రలో పార్టీ సీనియర్ నేత మిలింద్ దేవరా షాకిచ్చారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని, నేడు మహా సీఎం ఏక్‌నాథ్ షిండే సమక్షంలో శివసేనలో చేరుతున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. 55 ఏండ్లగా కాంగ్రెస్ పార్టీతో తమ కుటుంబానికున్న సంబంధం నేటితో తెగిపోయింది. నేను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనా చేశాను. నా రాజకీయ జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని నేడు ప్రారంభిస్తున్నాను. ఇన్నాళ్లు తనకు అండగా నిలిచిన కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు. కాగా, 2014 వరకు ఆయన ప్రాతిథ్యం వహించిన ముంబై దక్షిణ పార్లమెంట్ సీటుపై నెలకొన్న సందిగ్ధతే పార్టీ వీడటానికి కారణంగా తెలుస్తున్నది. రానున్న ఎన్నికల్లో ముంబై దక్షిణ ఎంపీ స్థానం నుంచి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. దీంతో పొత్తులో భాగంగా తనకు పోటీచేసే అవకాశం లభించదని భావించిన దేవరా.. పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు.

## మెట్రో గుడ్ న్యూస్.. నేడు, రేపు అన్ లిమిటెడ్ ఆఫర్

సంక్రాంతి పండుగ సందర్భంగా మెట్రో రైలు అధికారులు శుభవార్త అందించారు. హైదరాబాద్ మెట్రోలో నేటి నుంచి 3 రోజుల అపరిమిత ఆఫర్ అందుబాటులోకి తెచ్చారు. మెట్రో కార్డ్ హోల్డర్లు రూ.59 రీఛార్జ్ చేయడం ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. జనవరి 13, 14, 15 తేదీల్లో మెట్రో హాలిడే కార్డు వర్తిస్తుందని.. ఒక్కసారి రీఛార్జ్ చేసుకుంటే ఆ రోజంతా రైలులో ప్రయాణించవచ్చని అధికారులు స్పష్టం చేశారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## పండుగ పూట విషాదం.. ముగ్గు వేస్తుండగా అక్కాచెల్లెళ్లపైకి దూసుకెళ్లిన లారీ..

ఏలూరు జిల్లా మండవల్లి మండలం కానుకొల్లులో పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. ఇంటిముందు ముగ్గులు వేస్తుండగా.. అక్కాచెల్లెళ్లపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. .వివ రాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తెదేపా నేత పంగిళ్ల నాగబాబు కుమార్తెలు రోడ్డు పక్కనే ఉన్న తమ ఇంటి ముందు సంక్రాంతి ముగ్గులు వేస్తున్నారు. అదే సమయంలో గుడివాడ నుంచి కైకలూరు వైపు వెళ్తున్న ఇటుకల లారీ వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తేజస్విని (16) దుర్మరణం చెందగా, పల్లవీ దుర్గకు (18) గాయాలయ్యాయి. బాధితురాలిని గుడివాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను ప్రకాశ్‌రావుగా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగబాబు కుమార్తె మృతితో పెద్ద సంఖ్యలో తెదేపా నాయకులు కానుకొల్లుకు చేరుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. తేజస్విని, పల్లవీ దుర్గ ముదినేపల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు.




## క్రికెట్‌కి గుడ్ బై చెప్పిన షాన్ మార్ష్

ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు షాన్ మార్ష్ అన్ని రకాల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గతంలో టెస్టులు, వన్డేలు, టీ20లకు రిటైర్మెంట్ ఇచ్చిన మార్ష్ తాజాగా అన్ని టీ20 లీగ్స్ మ్యాచ్‌లకు కూడా రిటైర్మెంట్ పలుకుతున్నట్లు తెలిపాడు. మార్ష్ ఆస్ట్రేలియా తరపున 38 టెస్టులు, 73 వన్డేలు, 15 టీ20ల్లో ప్రాతినిథ్యం వహించాడు. అలాగే IPLలో పంజాబ్ కింగ్స్ తరపున ఆడిన మార్ష్ తొలి సీజన్లో 616 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ విన్నర్‌గా నిలిచాడు.




## హెచ్1బీ వీసాలో కీలక మార్పులు

హెచ్1బీ వీసాలకు సంబంధించిన కీలక సమాచారంతో అమెరికా ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీస్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆ ప్రకటన వెల్లడించింది. H1B వీసా దరఖాస్తుల కోసం ఆన్‌లైన్ ఫైలింగ్ ప్రక్రియ ఫిబ్రవరిలో ప్రారంభమైంది. US CIN H1B వీసా దరఖాస్తు రిజిస్ట్రేషన్‌ల కోసం కొత్త సంస్థాగత ఖాతాలను ప్రవేశపెట్టింది.



## భార్య ఐదో పెళ్లి.. మనస్తాపంతో భర్త ఆత్మహత్య

భార్య పెళ్లి కారణంగా నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఓ భర్త. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చోటుచేసుకుంది. వారం రోజుల క్రితం మంటలు అంటుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ వీడియోతో పాటు ఇంటి బయట రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రం మండలంలోని కలగుంట సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున డివైడర్ ను మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఏకొల్లు కు చెందిన ఒకరు, నాయుడుపేటకు చెందిన మరో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వైసీపీకి కౌంట్‌డౌన్..
# రాష్ట్రానికి మంచిరోజులు

### టీడీపీ అధినేత చంద్రబాబు



వైసీపీ ప్రభుత్వ అసమర్థ, విధ్వంస విధానాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. అమరావతి రైతులు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. ఈ ఐదేళ్లు వారికి చీకటి రోజులని చెప్పారు. రాజధాని పరిధిలోని మందడం గ్రామంలో నిర్వహించిన 'తెలుగు జాతికి స్వర్ణయుగం-సంక్రాంతి సంకల్పం' కార్యక్రమంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాల ఉత్తర్వులు, అమరావతి వ్యతిరేక ప్రతులను భోగి మంటల్లో వేశారు. అనంతరం చంద్రబాబు, పవన్ మాట్లాడారు.

**దేవతల రాజధానిని రాక్షసులు చెరబట్టారు**

ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని.. రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. దేవతల రాజధాని అమరావతిని రాక్షసులు చెరబట్టారని విమర్శించారు. 'ఇవాళ పండుగేమో భోగి.. పాలకుడేమో మానసిక రోగి' అని వ్యాఖ్యానించారు. శుభఘడియలు తలుపు తడుతున్నాయని.. 'వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్' కోసం నేటి నుంచి 87 రోజుల పాటు కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరూ ఒకే బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. "మన రాజధాని అమరావతే.. ఇది ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేస్తుంది. సంపద సృష్టించే కేంద్రంగా, సంక్షేమ పాలన అందించేందుకు ఉపయోగపడుతుంది. జగన్‌కు కూల్చడమే తెలుసు.. నిర్మించడం తెలియదు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి రైతుల పోరాడారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాలి. రాజకీయ హింస, మోసపు హామీలతో జగన్ బడుగు బలహీనవర్గాల ఉసురు తీస్తున్నారు. 32 రోజులుగా అంగన్వాడీలు పోరాడుతున్నా పట్టించుకోవడం లేదు. పండగ పూట కూడా వారిని రోడ్డుపై ఉండేలా చేశారు. వైసీపీ పాలనలో రైతులు చాలా కష్టాలు పడ్డారు. గిట్టుబాటు ధర లేదు.. తుపాను వచ్చి నష్టపోయినా వారిని పట్టించుకోలేదు. యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. భవిష్యత్తులో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే బాధ్యతను టీడీపీ, జనసేన తీసుకుంటాయి" అని చంద్రబాబు చెప్పారు.

**రాజధాని రైతుల సంకల్పం నెరవేరుతుంది: పవన్**

వైసీపీ పాలనతో రాష్ట్రానికి పట్టిన పీడ తొలగిపోయే సమయం ఆసన్నమైందని పవన్‌కల్యాణ్ అన్నారు. రాజధాని కోసం 33వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "రాజధాని రైతులను దారుణంగా కొట్టి వేధించిన ఘటన నన్ను కలచివేసింది. రైతుల సంకల్పం నెరవేరుతుంది. బంగారు రాజధాని నిర్మించుకుందాం. ఇది కేవలం అమరావతి సమస్య కాదు.. 5కోట్ల మంది ప్రజలది. మీ కష్టం రేపు శ్రీకాకుళం, పులివెందులలోనూ వస్తుంది. భవన నిర్మాణ కార్మికులు, నిరుద్యోగునూ వైసీపీ మోసం చేసింది" అని పవన్‌కల్యాణ్ విమర్శించారు.



# నేడు భారత్, అఫ్గాన్ రెండో టీ20

### 14 నెలల తర్వాత పొట్టి క్రికెట్‌లో కోహ్లీ
### రాత్రి 7 గంటల నుంచి

ఊహించినట్లుగానే తొలి టీ20లో అఫ్గానిస్థాన్‌ను చిత్తుచేసింది టీమ్‌ఇండియా. ఇప్పుడు రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్ పట్టేయడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ కోహ్లి పునరాగమనం.. బ్యాటింగ్‌లో రోహిత్ మెరుపులను ఆదివారం జరిగే మ్యాచ్‌లో అభిమానులు చూడాలనుకుంటున్నారు. అందుకే ఈ మ్యాచ్‌పై ఆసక్తి రేకెత్తుతోంది. మరోవైపు సిరీస్ ఆశలు నిలవాలంటే అఫ్గాన్ శక్తికి మించి పోరాడాల్సిందే.

ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌కు ముందు టీమ్‌ఇండియా చివరిగా ఆడుతున్న పొట్టి సిరీస్‌లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌పై కన్నేసిన టీమ్‌ఇండియా ఆదివారం విజయమే లక్ష్యంగా బరిలో దిగుతోంది. ఈ రెండో మ్యాచ్‌లో గెలిచి మరో పోరు మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకోవాలని రోహిత్ సేన చూస్తోంది. 14 నెలల తర్వాత తిరిగి టీ20 జట్టులోకి వచ్చిన రోహిత్, కోహ్లి ఈ సిరీస్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారిన సంగతి తెలిసిందే. తొలి టీ20లో రోహిత్ నాయకత్వ ప్రతిభతో ఆకట్టుకున్నా బ్యాటింగ్‌లో పరుగులు చేయలేకపోయాడు. ఇక ఆ మ్యాచ్‌కు దూరంగా ఉన్న కోహ్లి ఇప్పుడు అందుబాటులోకి వచ్చాడు.

**దూబెపై దృష్టి:** తొలి టీ20లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన శివమ్ దూబెపై మరోసారి అందరి దృష్టి ఉంటుందనడంలో సందేహం లేదు. హార్దిక్ గైర్హాజరీలో పేస్ ఆల్‌రౌండర్ స్థానాన్ని భర్తీ చేసేలా కనిపిస్తున్న దూబె నిలకడ కొనసాగించాల్సి ఉంది. ఇక గాయంతో వన్డే ప్రపంచకప్‌కు దూరమైన అక్షర్ పటేల్.. ఈ ఏడాది మాత్రం టీ20 ప్రపంచకప్‌లో ఆడాలనే పట్టుదల ప్రదర్శిస్తున్నాడు. ఆ దిశగా ప్రతి మ్యాచ్ అతనికి కీలకమే. తొలి టీ20లో పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు రెండు వికెట్లతో రాణించిన అక్షర్ ఈ మ్యాచ్‌లోనూ ఫామ్ కొనసాగించాల్సి ఉంది. గత మ్యాచ్‌లో సుందర్ వికెట్ల వేటలో విఫలమయ్యాడు. 3 ఓవర్లలో 27 పరుగులిచ్చి ఒక్క వికెట్టూ తీయలేకపోయిన అతని మరో



అవకాశం వస్తుందని కచ్చితంగా చెప్పలేం. అతని స్థానంలో కుల్‌దీప్‌ను ఆడించే ఆస్కారముంది. మరోవైపు యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ కూడా 11కు పైగా ఎకానమీ రేటుతో పరుగులు సమర్పించుకున్నాడు. తన సొంత మైదానంలో అవేశ్‌ను ఆడించాలని అనుకుంటే బిష్ణోయ్‌ను డగౌట్‌కే పరిమితం చేయొచ్చు. భారత ఫీల్డింగ్ మాత్రం మరింత మెరుగుపడాల్సి ఉంది.

**పుంజుకోవాలని:** తొలి టీ20ల్లో చెప్పుకోదగ్గ ప్రదర్శనే చేసిన అఫ్గానిస్థాన్ మ్యాచ్ సొంతం తీవ్రత కొనసాగించలేకపోయింది. మంచి ఆరంభం దక్కినా.. మధ్యలో నబి చెలరేగినా భారీ స్కోరు సాధించలేకపోయింది.ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో మరింత మెరుగ్గా రాణించి, పుంజుకోవాలని ఆ జట్టు చూస్తోంది.

## షెహనాజ్ గిల్ హాట్ లుక్స్

హిందీలో బిగ్ బాస్ 13 సీజన్ ద్వారా ప్రేక్షకులకు దగ్గరయ్యింది షెహనాజ్ గిల్. అమాయకత్వం.. చిలిపితనంతో అడియన్స్ ఫేవరెట్ కంటెస్టెంట్ గా పాపులారిటీని సంపాదించుకుంది. అదే సమయంలో దివంగత నటుడు సిద్ధార్థ్ శుక్లాతో షెహనాజ్ స్నేహంతో మరింత ఫేమస్ అయ్యింది. మోడలింగ్ ద్వారా కెరీర్ ఆరంభించిన షెహనాజ్.. ఇప్పుడు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారింది. కొద్ది రోజుల క్రితం సల్మాన్ ఖాన్ నటించిన కిసీ కా భాయ్ కిసీ కీ జాన్ మూవీలో కీలక పాత్రలో నటించింది. ప్రస్తుతం ఆమె నటించిన చిత్రం 'థ్యాంక్యూ ఫర్ కమింగ్'.కొద్ది రోజుల క్రితం సల్మాన్ ఖాన్ నటించిన కిసీ కా భాయ్ కిసీ కీ జాన్ మూవీలో కీలకపాత్రలో నటించింది.